సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



ఎల్లలు దాటిన మన 'రాఖీ'

రాఖీల తయారీలో సిద్దిపేట ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడి రాఖీలే అంతటా విక్రయిస్తున్నారు. వివరాలు 8లో ▸



ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు

చేర్యాల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వివరాలు 9లో ▸

స్పాట్ అడ్మిషన్లు

నంగునూరు(సిద్దిపేట): పాలిసెట్ కౌన్సెలింగ్ ద్వారా మిగిలిపోయిన సీట్లకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. తొమ్మిది సీట్లు మిగిలాయన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో మెరిట్ కమ్ ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిన్నకోడూరు (సిద్దిపేట): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. గురువారం చిన్నకోడూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కాలం చెల్లిన మందులు వాడకూడదని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు. అనంతరం చిన్నకోడూరు, రామంచ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణం ప్రారంభించని ఇళ్లను త్వరగా మొదలు పెట్టి పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సోమిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదవండి ఉన్నతంగా ఎదగండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి



కోహెడలో విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నతంగా ఎదగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సూచించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సౌజన్యంతో ప్రధాని మోదీ కానుకగా పాఠశాల విద్యార్థులకు 61 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సైతం బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకొని తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశం, మండలాధ్యక్షుడు జాలిగం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లోని తన నివాసంలో రూ.15.73లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన భారం పడుతున్న పేదల అభ్యున్నతే లక్ష్యంగా సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ నాయకులు మొనగారి రాజు, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి: చెట్లకు రాఖీలు కడుతున్న విద్యార్థులు, గ్రామస్తులు



చేర్యాల: మొక్కలకు రాఖీలు కడుతున్న రాంపూర్ విద్యార్థులు

చెట్టుకు బొట్టుపెట్టి.. రాఖీ కట్టి

ఘనంగా వృక్షాబంధన్ వేడుకలు

ప్రకృతి ప్రేమికులు వినూత్న రీతిలో రక్షాబంధన్ జరుపుకొన్నారు. పర్యావరణ పరిరక్షణకు వృక్షాలే కీలకమంటూ.. వృక్షాబంధన్ పేరుతో వేడుకలు చేశారు. చేర్యాల మండలం రాంపూర్, అక్బర్‌పేట–భూంపల్లి మండలం కూడవెల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ప్రాణవాయువు నిచ్చే చెట్లకు బొట్టు పెట్టి రాఖీ కట్టారు. 'మనం చెట్లకు రక్షణ–చెట్లు మనకు రక్షణ' అంటూ గులాబీ పూలతో అల్లిన రాఖీలను చెట్లకు కట్టి మిఠాయిలు పంచుకున్నారు. వృక్షో రక్షతి రక్షితః అంటూ అందరం మొక్కలు నాటి పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – చేర్యాల(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)

పార్కు జాగా.. పాగా

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు

- 'హౌసింగ్ బోర్డు'లో ఎకరంపైగా కబ్జా
- మరోవైపు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పార్కు, ఓపెన్ జిమ్ తొలగింపు!
- అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు

సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే పార్కులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆహ్లాదం కనుమరుగవుతోంది. సిద్దిపేట పట్టణం 1340 సర్వే నంబర్‌లో 1999లో లోయర్ ఇన్‌కమ్ గ్రేడ్ కాలనీ పేరిట 15 ఎకరాల్లో హౌసింగ్ బోర్డు కాలనీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 10శాతం స్థలం పార్కులు, ఇతర అవసరాల కోసం మొత్తంగా 7చోట్ల 1.5ఎకరాల స్థలం కేటాయించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్, మార్కెట్‌లను నిర్మించారు. మరో మూడు చోట్ల ఖాళీ స్థలాలు ఉండాల్సి ఉండగా ఆక్రమణలకు గురయ్యాయి. నేడు ఎక్కడా స్థలాలు లేకపోవడంతో పార్కు స్థలంలోనే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నిర్ణయించడంపై స్థానికుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, సిద్దిపేట

జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని మున్సిపాలిటీ తాజాగా నిర్ణయించింది. ఖాళీ స్థలాలు ఎక్కడా లేకపోవడంతో చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలో ఉన్న ఓపెన్ జిమ్, పార్కు స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఓపెన్ జిమ్‌లో స్థానికులు వ్యాయామం, చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలు ఆడుకుంటున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన పార్క్, ఓపెన్ జిమ్‌లను తొలగిస్తుండటం గమనార్హం. అదే హౌసింగ్ బోర్డు వారు వసతుల కోసం వదిలిపెట్టిన ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడు ట్యాంక్ నిర్మాణం ఆ స్థలంలో ఏర్పాటు చేసే వారని స్థానికులు చెబుతున్నారు.. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు చోద్యం చూశారే తప్ప చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నాడు దేవాలయానికి స్థలం కేటాయించినా..

సిద్దిపేట పట్టణం మూడవ వార్డులోని ఓ కాలనీలో లే అవుట్ చేసే సమయంలో దేవాలయానికి స్థలాన్ని సదరు వెంచర్ నిర్వాహకులు వదిలిపెట్టారు. ఇప్పుడు ఆ స్థలానికి డిమాండ్ రావడంతో దేవాలయం నిర్మించకుండా వెంచర్ నిర్వాహకుడే స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులకు గతంలో కాలనీ వాసులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పార్కు స్థలాలకు రక్షణ కరువు

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో లక్షల రూపాయలు విలువ చేసే పార్కు, మౌలిక వసతుల స్థలాలకు రక్షణ కరువైంది. పార్కు స్థలాలు, ఇతర అవసరాలకు వినియోగించే స్థలాల్లో ఇళ్లు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలిశాయి. పార్కుల స్థలాలను కాపాడడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఖాళీ స్థలాలను కబ్జా చేసి విక్రయాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం తొలగించనున్న ఓపెన్ జిమ్

కాగితాల్లోనే స్థలాలు

పట్టణాలు, గ్రామాల్లోని పార్కు, ఇతర అవసరాల కోసం కేటాయించిన స్థలాలు కాగితాల్లోనే కనిపిస్తున్నాయి. లే అవుట్‌లు ఏర్పాటు చేసే సమయంలో దేవాలయం, పార్కు, వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్‌కు ఇలా ఉంటుందని మ్యాప్‌లలో వెంచర్ నిర్వాహకులు రూపొందిస్తున్నారు. వాటిని చూసి ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. తీరా కొన్ని రోజుల తర్వాత ఆ స్థలాలను సైతం వెంచర్ నిర్వాహకులు విక్రయిస్తున్నారు. వీటిపై మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రియల్టర్ అధికారులను మచ్చిక చేసుకోవడంతో అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పార్కులు, ఇతర అవసరాలకు వదిలిన ఖాళీ స్థలాలు రక్షించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పార్కు, ఇతర అవసరాలకు లే అవుట్‌లో వదిలి పెట్టిన స్థలాలు కబ్జాలకు గురైతే వాటిపై ఫిర్యాదులు అందితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. హౌసింగ్ బోర్డు కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం తప్పనిసరి. ఎక్కడా స్థలాలు లేకపోవడంతో పార్కును ఎంపిక చేశాం. ట్యాంక్ నిర్మాణం అయిన తర్వాత దాని కింద అద్భుతమైన చిల్డ్రన్స్ పార్కును, ఓపెన్ జిమ్ నిర్మిస్తాం.

– అశ్రిత్ కుమార్, కమిషనర్, పురపాలక సంఘం సిద్దిపేట

యూరియా తిప్పలు



ఎన్సాన్‌పల్లిలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. యూరియా, డీఏపీ వంటి ఎరువుల నిల్వలు తగినంతగా లేకపోవడంతో వాటి కోసం రైతుల తిప్పలు అన్నీఇన్నీకావు. వర్షాలు కురుస్తుండటం.. గురువారం స్టాక్ రావడంతో జిల్లా పరిధిలోని ఎన్సాన్‌పల్లి వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉదయం 7 గంటలనుంచే బారులు తీరారు. గంటల తరబడి నిరీక్షించి ఎరువుల బస్తాను దక్కించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, సిద్దిపేట

భూభారతి దరఖాస్తులు పరిష్కరించండి

సిద్దిపేటరూరల్: భూభారతి కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించిన అర్జీలను యుద్ధ ప్రాతిపాదికన పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు రకాల భూభారతి దరఖాస్తులు వివిధ అధికారుల స్థాయిలో లాగిన్‌లో పెండింగ్ ఉన్న వాటి గురించి ఆరా తీశారు. రోజువారీగా టార్గెట్ పెట్టుకుని భూభారతి చట్టంలోని మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



చేనేత ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హైమావతి

గొల్లభామ మెరవాలి.. చేనేత మురవాలి

- ఉత్పత్తులకు బ్రాండ్ సిద్దిపేటగా మారుద్దాం
- ప్రతీ సోమవారం చేనేత దుస్తులనే ధరిద్దాం
- కలెక్టర్ హైమావతి
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

సిద్దిపేటరూరల్: గొల్లభామ ఉత్పత్తులకు బ్రాండ్ సిద్దిపేటగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని కలెక్టర్ హైమావతి నేత కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మొదటగా కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి మీటింగ్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన నాగరికతకు ఆనవాళ్లు మనం వేసుకునే వస్త్రాలేనని అన్నారు. నేతన్నల సంక్షేమం, అభివృద్ధికి అందరూ కలిసి సొసైటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్ కు అనుగుణంగా ఉత్పత్తులు రావాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం తరపున పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. ప్రతి సోమవారం తాను కాటన్ వస్త్రాలను ధరిస్తానని, జిల్లా యంత్రాంగంతో పాటు అందరూ కాటన్ దుస్తులు ధరించాలన్నారు. చేనేత వస్త్రాల తయారీలో మహిళలు సంఘంగా ఏర్పడితే వారందరికీ స్థలం ఇవ్వడంతో పాటు ఆర్థిక తోడ్పాటు కోసం బ్యాంకర్ల ద్వారా సహకారం అందిస్తామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ సిద్దిపేట చేనేతకు ప్రాధాన్యం ఇవ్వడానికి కృషి చేస్తానని తెలిపారు. సిద్దిపేట గొల్లభామకు ప్రాచుర్యం కల్పించడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురి నేత కార్మికులను సన్మానించారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులను సత్కరించారు. నేతన్న పొదుపు పథకం కింద 550 మంది లబ్ధిదారులకు రూ.15లక్షల 84 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అధికారి సాగర్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఉద్యాన శాఖ అధికారి, జెడ్పీ సీఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం..





అవార్డు అందుకుంటున్న బైరి శ్రీనివాస్, వెంకటేశం

చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో అధికారికంగా చేనేత కార్మికులను ప్రభుత్వం సన్మానించింది. వృత్తి పరంగా నైపుణ్యాలను ప్రదర్శించిన నేతన్నలను కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక అవార్డులతో సత్కరించింది. జిల్లాకు చెందిన బైరి శ్రీనివాస్, మంతూరి వెంకటేశం, జిందం రాజేశంలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. అవార్డు గ్రహీతలకు నగదు, ప్రశంసాపత్రాలను అందించారు. – సిద్దిపేటజోన్

పంద్రాగస్టుకు ఏర్పాట్లు చేయండి

సిద్దిపేటరూరల్: పంద్రాగస్టుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి వేడుకలు కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయ ఆవరణలో గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, స్టాళ్ల ఏర్పాటు, ముఖ్య అతిథి ప్రసంగం సిద్ధం చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రభుత్వ మెడలు వంచుతాం

హామీలు అమలు చేయిస్తాం

- నగం మందికే రుణమాఫీ..
- సన్న వడ్లకు బోనస్ అందలేదు
- రైతు ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు



రైతు ధర్నాలో ప్లకార్డులతో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి తదితరులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలు చేసేలా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్నాకు వచ్చిన రైతుల్లో ఎంతమందికి రుణమాఫీ కాలేదో చేతులు ఎత్తాలని కోరగా, 30 శాతం మంది చేతులు ఎత్తారు. అలాగే బోనస్ రాని రైతులు ఎంతమంది అని పేర్కొనగా.. అక్కడున్న వారంతా చేతులు ఎత్తారు. ఇదీ కాంగ్రెస్ సర్కారు తీరని ఎద్దేవా చేశారు. కాగా ధర్నా మధ్యలో హరీశ్‌రావుకు ఫోన్ రావడంతో మళ్లీ వచ్చి జాయిన్ అవుతానంటూ వెళ్లిపోయారు. అనంతరం నాయకులు కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్‌ఓ భుజంగరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్– బీజేపీ మిలాఖత్: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌లు మిలాఖత్ అయ్యాయని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. మోదీ, రేవంత్ కేసీఆర్ మీదికి ఒంటి కాలిపై లేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం ఈటల రాజేందర్, వెంకటరమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తప్ప, మిగితా వారంతా రేవంత్‌రెడ్డికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రైతులు ఎరువుల కోసం చెప్పులు వరుసలో పెట్టాల్సిన దుస్థితి మళ్లీ వచ్చిందని వాపోయారు.

ప్రాజెక్టుల గేట్లు బద్దలు కొడతాం

జిల్లాకు సాగు నీరు విడుదల చేయకపోతే ప్రాజెక్టుల గేట్లు బద్దలు కొట్టి రైతుల పొలాలకు నీళ్లు వదులుతామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నీళ్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాకు నీరందించే ప్రాజెక్టులపై ఒక్కసారి కూడా సమీక్ష జరిపిన పాపాన పోలేదని ఎమ్మెల్యే అన్నారు.

బ్రహ్మాండనాయకుడి రథోత్సవం

భక్తుల కోలాటాలు.. మహిళలు, చిన్నారుల ఆటపాటల మధ్య బ్రహ్మాండనాయకుడి రథోత్సవం వైభవంగా సాగింది. దుబ్బాక బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పుర వీధుల గుండా రథోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు.

– దుబ్బాక



చిన్నారుల కోలాటాలు.. నృత్యాలు (ఇన్‌సెట్‌లో) స్వామివారి రథోత్సవం

వరలక్ష్మి వ్రత శోభ.. మార్కెట్లన్నీ కిటకిట

శ్రావణ మాసం.. అందులో వరలక్ష్మి వ్రతం ఆచరించే శ్రావణ శుక్రవారం అంటే మహిళా భక్తుల హడావుడి ఇంతా అంతా కాదు. వ్రతానికి అవసరమైన పూలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. జిల్లాలోని ఆలయాలు వరలక్ష్మి వ్రతాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వ్రతాలతో పాటుగా, వాయినాలను మహిళలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి

క్లుప్తంగా

మోదీకి 'ఆపరేషన్ సింధూర్' శాలువా బహూకరణ



మోదీని సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గురువారం ప్రధాని మోదీకి అగ్గిపెట్టెలో పట్టే బంగారు శాలువాను బహూకరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ప్రత్యేకంగా బంగారు నూలుపోగుతో తయారు చేసిన ఆపరేషన్ సింధూర్ చిత్రపటం కలిగిన శాలువాను ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో బహూకరించారు. పీఎంను సన్మానించిన వారిలో మెదక్ ఎంపీతో పాటు ఆదిలాబాద్ ఎంపీ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాపురెడ్డి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సిర్సినగండ్లలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గూడెం బాపురెడ్డి (64) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో వరితో పాటు మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. ఆ తర్వాత కాసేపటికి బాపురెడ్డి భార్య భాగ్యమ్మ పొలానికి వెళ్లి చూడగా.. అపస్మారక స్థితిలో ఉన్న భర్తను చూసి కేకలు వేసింది. దీంతో స్థానిక రైతులు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న బాపురెడ్డిని చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కాగా, మృతుడికి ఒకే కూతురు ఉండడంతో ఆమె తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్



సీజ్ చేసిన ఇసుక డంప్ వద్ద పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అక్రమంగా డంప్ చేసిన ఇసుకను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ సైఫ్ అలీ తెలిపారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అనంతసాగర్ శివారుల్లో గ్రామానికి చెందిన చెరుకు కనకయ్య, తోటపల్లి స్వామి, తోటపల్లి రాజు కలిసి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రదేశంలో 100 టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అయితే దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేశారు. ఎస్ఐ సైఫ్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం, మట్టి అక్రమ రవాణా, మత్తు పదార్థాలు విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

ములుగు(గజ్వేల్): కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పత్తెపు మహేష్(40)కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అయితే ఈ అప్పులు రోజురోజుకూ పెరిగిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చేందుకు మార్గంలేక ఇటీవల ఇల్లును విక్రయించేందుకు ప్రయత్నించాడు. అందుకు కుటుంబీకులు అంగీకరించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం రాత్రి 11 గంటలకు గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన లక్ష్మయ్య

గజ్వేల్‌రూరల్: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొడకండ్లలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య(58 రోడ్డు దాటుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎల్లలు దాటిన మన రాఖీ..

వినూత్న రాఖీల తయారీలో సిద్దిపేటకు ప్రత్యేక గుర్తింపు

- దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్
- సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాఖీలు
- అందుబాటులో రూ.1 నుంచి రూ.10 వేల వరకు
- జిల్లా వ్యాప్తంగా మొదలైన రాఖీ సందడి



వివిధ రకాల రాఖీలు



రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రక్షాబంధన్.. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక. రాఖీ అంటే కేవలం దారం మాత్రమే కాదు.. తోబుట్టువుల మధ్య పవిత్రబంధానికి చిహ్నం. ఈ పండుగను పురస్కరించుకొని తమ సోదరులు సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎక్కడ ఉన్నా తోబుట్టువులు అక్కడికి చేరుకొని రాఖీలు కట్టడం సంప్రదాయంగా వస్తుంది. ఒక వేళ అందుబాటులో లేకున్న కొరియర్, పోస్టల ద్వారా రాఖీలు తమ సోదరులకు చేరే విధంగా పంపిస్తుంటారు. అలాంటి విశిష్ట విలువలు కల్గిన ఈ రాఖీ పండుగ రానే వచ్చింది. అయితే గతంలో రాఖీ పండుగ రాగానే చేతి నిండా ఒకేరకమైన రాఖీలే కనిపించేవి. కానీ నేడు వివిధ రకాల రాఖీలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. దీంతో ప్రజలకు తమకు నచ్చిన రాఖీలను ఖరీదు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల్లో రూ.1 నుంచి రూ.10వేల వరకు విలువైన రాఖీలు విక్రయిస్తున్నారు. అయితే సిద్దిపేట జిల్లాలోనే అధికంగా రాఖీలు తయారు కావడంతో ఇక్కడి ప్రజలకు తక్కువ ధరకే రాఖీలు అందుబాటులో ఉంటున్నాయి. మన ప్రాంతంలో తయారవుతున్న ఈ రాఖీలు దేశవ్యాప్తంగా సరఫరా కావడం విశేషం.

రాఖీల తయారీకి అడ్డా..

రాఖీల తయారీకి సిద్దిపేట అడ్డాగా మారింది. వివిధ రకాల రాఖీలను వ్యాపారులు నచ్చిన విధంగా తయారు చేయిస్తున్నారు. దీంతో స్థానికులకు జీవనోపాధితో పాటువ్యాపారం కొనసాగుతుంది. రాఖీ పౌర్ణమికి ముందుగా మాత్రమే రాఖీలు విక్రయిస్తారు. అందుకోసం ఆరు నెలల ముందు నుంచే రాఖీల తయారీ కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 10 వరకు రాఖీ తయారీ, హోల్‌సెల్ విక్రయ కేంద్రాలు ఉండగా.. సుమారు 1000 వరకు రిటైల్ రాఖీ విక్రయ కేంద్రాలు ఉన్నాయి. రాఖీలు నాణ్యతతో రావడంతో సిద్దిపేట రాఖీలకు ఇతర రాష్ట్రాల్లో విపరీతంగా డిమాండ్ పెరు గుతుంది.

ఇతర రాష్ట్రాలకు సరఫరా..

రాఖీల తయారీకి సిద్దిపేట కేంద్రంగా నిలుస్తుంది. ఇక్కడ తయారయ్యే రాఖీలు దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు సరఫరా అవుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గోవా, ఒరిస్సాలకు సరఫరా చేస్తున్నారు. ఆర్డర్‌ల ఆధారంగా మరిన్ని రాష్ట్రాలకు ఈ రాఖీల సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలలో ఉన్న ప్రవాస భారతీయులు కూడా తమ మిత్రులతో కొరియర్, స్పీడ్ పోస్టల ద్వారా రాఖీలను ఖరీదు చేస్తున్నారు





రాఖీల్లో రకాలు..

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా రాఖీలను తయారు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా భగవద్గీత రాఖీ, మీనాకారీ రాఖీ, పూజారాఖీ, తాళీ రాఖీ, సీజెడ్ రాఖీ, ఈడీ రాఖీ, బంగారు రాఖీ, సిల్వర్ రాఖీ, కాఫర్ రాఖీ, పాఠశాల రాఖీ, డాక్టర్ రాఖీ, పర్యావరణం రాఖీ, తదితర అంశాలతో స్ఫూర్తినిచ్చే విధంగా రాఖీలను తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. రాఖీల్లో సంస్కృతి ప్రతిబింబించే విధంగా తయారు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో ఉండ టంతో సిద్దిపేట రాఖీలకు అంతటా డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోళ్లతో సందడి..



సిద్దిపేటలో ప్రజలతో కిక్కిరిసిన సుభాష్‌రోడ్డు

రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రాఖీ విక్రయ కేంద్రాల వద్ద రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరారు. తమకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు మిఠాయి దుకాణాల్లోనూ సందడి నెలకొంది. ఇదిలా ఉండగా, గురువారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. కొన్ని పాఠశాలలో ఏకంగా ఎకో రాఖీలను ప్రత్యేకంగా విద్యార్థులతో తయారు చేయించి తోటివారికి కట్టించారు.

దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు

సిద్దిపేటలో తయారయ్యే రాఖీలకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. రాఖీల తయారీలో సంస్కృతి ఉట్టిపడుతుంది. ప్రతి డిజైన్‌లో సాంప్రదాయాలకు సంబంధించిన విశిష్టత ఉండే విధంగా తయారు చేస్తున్నాం. వీటితో పాటు పర్యావరణం, పాఠశాలలు, భగవద్గీత, దేవతల, వివిధ ప్రయోగాలకు సంబంధించిన రాఖీలను తయారు చేస్తున్నాం. రూ.1 నుంచి రూ.10వేల వరకు రాఖీలను తయారీ చేసి విక్రయిస్తున్నాం. - మణిదీప్, విజయలక్ష్మి రాఖీ సెంటర్, సిద్దిపేట



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

చెట్టును ఢీకొట్టిన కారు

- ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృత్యువాత
- శివ్వంపేట, లింగాపూర్ గ్రామాల్లో విషాదఛాయలు



బాలమణి (ఫైల్)



ఆంజనేయులు (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తూప్రాన్–నర్సాపూర్ హైవే చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న ఓ కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటకు చెందిన కొడకంచి బాలమణి(68) చిన్న కుమారుడు నర్సింలుగౌడ్ నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం వరలక్ష్మీవ్రతం కావడంతో శివ్వంపేటలో ఉన్న తన అమ్మను నర్సాపూర్‌కు తీసుకొచ్చేందుకు సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న నర్సాపూర్ మండలం లింగాపూర్‌కి చెందిన ఉప్పలపు ఆంజనేయులు(37) కారులో పంపించాడు. అయితే బాలమణిని ఆంజనేయులు తీసుకుని కారులో తీసుకొస్తుండగా.. చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు నర్సాపూర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో శివ్వంపేట, లింగాపూర్ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నారు. కాగా, ఆంజనేయులుకు భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లు హరిక, తేజశ్రీ, కొడుకు రోహిత్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ...

శివ్వంపేటలో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి పరామర్శించారు.

కార్యదర్శిపై ఎంపీడీఓకు ఫిర్యాదు

- మద్యం తాగి ఇబ్బందికి గురిచేస్తున్నట్లు గ్రామస్తుల ఆరోపణలు
- డీపీఓకు సరెండర్ చేసిన ఎంపీడీఓ



చిలాపూర్‌పల్లె కార్యదర్శి రఫీతో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌పల్లె గ్రామానికి డిప్యుటేషన్‌పై వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఎండీ రఫీ మద్యం మత్తులో విధులు నిర్వహిస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేష్ గురువారం ఎంపీడీఓ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. రోజూ మద్యం తాగి విధులు సైతం సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు గ్రామస్తులు ఏఐవైఎఫ్ నాయకులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఆ సంఘం నాయకుడు మహేష్ గ్రామానికి వెళ్లి కార్యదర్శి రఫీతో ఆరా తీయగా.. మద్యం మత్తులో పొంతన లేకుండా సమాధానాలు చెప్పారు. వెంటనే కార్యదర్శిపై ఎంపీడీఓకు వివరించారు. అప్పటికే మద్యం తాగి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గ్రామస్తులు చెప్పడంతో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో చిలాపూర్‌పల్లె గ్రామ కార్యదర్శి రఫీని డీపీఓకు సరెండర్ చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. కార్యదర్శి రఫీ కోహెడ మండలం నుంచి డిప్యుటేషన్‌పై చిలాపూర్ పల్లెకు వచ్చినట్లు తెలిపారు.

ముగిసిన వృక్షశాస్త్ర రాష్ట్ర స్థాయి 'కార్యశాల'



డాక్టర్ సబితారాణిని సన్మానిస్తున్న వృక్షశాస్త్ర రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వాహకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: తేనెటీగలు 30 వేల మొక్కల మకరందంతో తేనెను తయారు చేస్తాయని ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సబితారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల కార్యశాల గురువారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. వృక్ష ప్రపంచాన్ని అన్వేషించే విషయంలో ప్రత్యక్ష పద్ధతి ద్వారా మొక్కలను గుర్తించి వాటి ఉపయోగాలు తెలుసుకునేందుకు ఇలాంటి కార్యశాలల ద్వారా మాత్రమే విద్యార్థులకు అర్థమవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు డిగ్రీ కళాశాలల్లో చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రాంరెడ్డి మాట్లాడుతూ మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. కాగా, ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి మొక్కల వర్గీకరణ, హెర్బేరియం తయారీలోని మెలకువలపై క్లుప్తంగా వివరించారు. రెండవ సాంకేతిక సమావేశంలో 'తెలంగాణా ప్రాంతంలో లభించే ఔషదమొక్కలు–వాటివల్ల జీవకోటికి లభించే లాభాల'పై కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సిద్ధి వీరేశం వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, కార్యశాల కన్వీనర్ డాక్టర్ రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శైలజ, డాక్టర్ మీరాజ్ ఫాతిమా, స్రవంతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్‌లతో పాటు వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్యాప్‌జెమిని'తో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



ఒప్పంద పత్రాలతో విష్ణు సొసైటీ చైర్మన్, క్యాప్‌జెమిని రిక్రూట్‌మెంట్ కంపెనీ ప్రతినిధులు

నర్సాపూర్: 'క్యాప్‌జెమిని' కంపెనీతో ఒప్పందం చేసుకోవడంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజ్ గురువారం క్యాప్‌జెమిని రిక్రూట్‌మెంట్ కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి విష్ణురాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీల్లో బయోమెడికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ నడుపుతున్న ఏకైక కాలేజీ తమదని చెప్పారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన వివరించారు. అనంతరం క్యాప్‌జెమిని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అతుల్ కురాని మాట్లాడుతూ.. మెడికల్ తదితర రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ప్రోగ్రాం మేనేజర్ సౌరవ్ నారాయణ్ బిశ్వాస్, సొసైటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్స్ సంజయ్‌దూబె, రమేష్, ఇండస్ట్రీ రిలేషన్స్ ఆఫీసర్ సతీష్‌చంద్ర, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బంగారురాజు, ఇతర ప్రతినిధులు రవికిరణ్, రాజు, బాపిరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి పట్టివేత

వట్‌పల్లి(అందోల్): బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 2 కిలోల గంజాయిని వట్‌పల్లిలో మెదక్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మంచిర్యాలతండాకు చెందిన జైపాల్ నాగల్‌గిద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సీఐ గాంధీనాయక్ ఆధర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఓ బైక్‌ను తనిఖీ చేయగా 2 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ గంజాయి విలువ రూ.1.70 లక్షలు ఉంటుందన్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం కేసును జోగిపేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగిస్తామన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఎండీ అలీం, సిబ్బంది గోపాల్, అనిల్, మల్కయ్య, .రామరావు, ఉమ, ముజామిల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నాడని ఎంపీడీఓ శ్రీనివాస వర్మకు గురువారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పూడ్చివేసిన పాత బావి స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి బాల్‌నర్సయ్యకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, ఏగొండ స్వామి, మెరుగు రవి, చింతల కనుకయ్య, పెంటయ్య, కనుకయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళల అదృశ్యం



బక్కమ్మ

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లిలో ఓ మహిళ అదృశ్యమైంది. జహీరాబాద్ రూరల్ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుగ్గెల్లికి చెందిన జంబుల బక్కమ్మ(49) ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసింది. అయితే ఉదయం చూసే వరకు ఆమె కనిపించలేదు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులను విచారించినా రాలేదని చెప్పారు. దీంతో ఆమె కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పాటి ఎంపీఆర్ అర్బన్ సిటీలో..



త్రివేణి

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి ఎంపీఆర్ అర్బన్ సిటీలో నివాసం ఉండే త్రివేణి జూలై 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హమాలికాలనీలో



మొహినొద్దీన్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హమాలికాలనీకి చెందిన ఎండీ మొహినొద్దీన్(48) అదృశ్యమైనట్లు జహీరాబాద్ టౌన్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. పట్టణంలోని హమాలీ కాలనీకి చెందిన మొహినొద్దీన్ కూలీ పనుల నిమిత్తం ఈ నెల 3న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో భార్య షబానా బేగం జహీరాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది..ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఈదుల నాగులపల్లిలో..



లాల

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామచంద్రపురం పరిధిలోని ఈదుల నాగులపల్లికి చెందిన లాల (60) గత నెల 16వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి సమయాల్లో పూజలు

- ప్రశ్నించిన వారిపై దాడులు
- ముగ్గురిపై కేసు నమోదు





చికిత్స పొందుతున్న దుర్గయ్య, హేమంత్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారంలో ఓ కుటుంబ సభ్యులు రాత్రి సమయాల్లో ఇంట్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఎందుకు పూజలు చేస్తున్నారని అడిగిన స్థానికులపై ఆ కుటుంబసభ్యులు దాడికి దిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో ఉంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన శరవన్ కుమార్ పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలో ఓ స్థలం కొనుగోలు చేశాడు. అయితే ఇటీవల ఈ స్థలంలో ఒక స్లాబ్ కూడా నిర్మించగా.. అదే స్థలంలో శరవన్ కుటుంబ సభ్యులు గుంత తవ్వి బుధవారం రాత్రి పూజలు నిర్వహించుకుంటున్నారు. అయితే తమ ఇంట్లో పిల్లలు ఉన్నారని, ఈ సమయంలో పూజలు ఎందుకు నిర్వహిస్తున్నారని శరవన్ కుటుంబ సభ్యులను పక్కన ఉంటున్న ఉన్న దుర్గయ్య అడగగా.. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దంతో శరవన్ కుమార్ కుటుంబ సభ్యులు దుర్గయ్యపై రాడ్డుతో దాడి చేశారు. ఇదేంటని స్థానికులు హేమంత్, ఉమామహేశ్వర్‌ల అడగగా.. వారిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో హేమంత్‌కు తీవ్ర గాయాలవ్వగా.. దుర్గయ్య, ఉమామహేశ్వర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు శరవన్ కుమార్, ప్రభుతో పాటు మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హర్ ఘర్ తిరంగా' ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



హర్ ఘర్ తిరంగా ఆకృతిలో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మెరిడియన్ సీబీఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండా, హర్‌ఘర్ తిరంగా, తదితర రుపాలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల కేబినెట్ పదవుల్లో ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ అందరికి ప్రేరణగా నిలవాలన్నారు. నాయకత్వం గొప్ప బాధ్యత అని, క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవా భావం, అనేది నాయకుని లక్షణాలుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజవెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.